# బొమ్మా బొరుసు

బెహరా వెంకట సుబ్బారావు



మెడికల్ చెకప్‌కోసం హాస్పటల్‌కు వెళ్ళి నడచి వచ్చి వీధి అరుగు మీదనే చతికిలపడి ఆయాసపడ్తూన్న నిండుగర్భిణిలా— ఆ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ యింజను వాల్తేరు స్టేషన్ చేరి హమ్మయ్య అనుకొంది. నిట్టూర్చింది కాబోలు! పెద్దగా శబ్దం చేస్తూ స్టీమ్‌ని బయటకు వదలింది.

ట్రైన్ ప్లాట్‌ఫారం మీదకురాగానే ప్రయాణీకుల్లో అలజడి రేగింది. దెబ్బతిన్న తేనెపట్టు ఈగల్లా చెల్లాచెదురుగా పరుగెత్తసాగారు. నా అర్ధాంగి పార్వతిలోకూడా కంగారెక్కువైంది.

"మన పెట్టె ఎక్కడుందో చూడండి!" నన్నుకూడా కంగారు పెడుతోంది. సామాన్లు పోతాయేమోనన్న బెంగతో పిల్లలవైపూ వారి చేతుల్లో వున్న సామాన్లవైపూ చూస్తున్నా. పెద్దబ్బాయికీ పెద్దమ్మాయికీ చెరో రెండు సామాన్లూ, నాకు పెట్టె ఒక సంచీ అప్పగించింది పార్వతి. తానొక ప్లాస్టిక్ వైర్‌బేగ్‌ను తీసుకొంది. తిరిగి యిల్లు చేరేవరకూ ఎవరి సామానులను వారు జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పింది. అంతా తమ తమ సామాన్లను పట్టుకొని లేచి నిలబడి వున్నారు.

"ఏవిటలా నీళ్ళు నములుతూ చూస్తున్నారు? మన కంపార్టుమెంటెక్కడుందో చూడండి!" తొందర చేయసాగింది పార్వతి.

"ఎందుకమ్మా కంగారు? మన బెర్తులు రిజర్వు అయాయిగా! కంపార్టుమెంటు ఎక్కడుందో చూసుకోవాలి!" నిదానంగా చెప్పాడు ఇంటర్ చదువుతున్న మా పెద్దబ్బాయి రమేష్.

"ట్రైన్ ఇక్కడ అరగంటకి పైనే ఆగుతుంది! కంగారు పడకు!" నిదానంగా చెప్పింది పెద్దమ్మాయి.

సామాన్లు జాగ్రత్తగా చూచుకోమని చెప్పి మా బోగీ ఎక్కడుందో చూడ్డానికి వెళ్ళా. బోగీ దొరికింది. సామాన్లు తీసుకొని బయలుదేరాం. ముందుగా రమేష్ వాడి వెనుక పార్వతి పెట్టెలో జొరబడ్డారు. వారి వెనుక తక్కిన ముగ్గురుపిల్లలూ నేనూ ఎక్కాం—మావిమొత్తం ఆరు బెర్తులు. వరుసనెంబర్లు. ఆడుగు బల్లల మీద ఎవరో ముగ్గురు స్త్రీలు కూర్చొని వున్నారు.

"ఈ బెర్తులు మావి! దిగండి!" దబాయించాడు రమేష్. వారు వులుకూ పలుకూ లేకుండా మూగవారిలా ప్రవర్తిస్తున్నారు. పార్వతిలో సహనం నశించింది.

"మిమ్మల్నే! చెబితే వినబడదూ? ఖాళీ చేయండి" హుంకరించింది పార్వతి. వారు జవాబు చెప్పలేదు. ప్లాట్‌ఫారం వైపు చూస్తున్నారు.

"చూడండి! మొండితనం! ఖాళీచేయడం లేదు! మీరూ ఒకసారి చెప్పండి!" నాతో ఫిర్యాదు చేసింది. సామాన్లు లెక్కపెట్టు

కొంటూ వాటిని బల్లలకింద సర్దే ప్రయత్నంలో వున్న నేను ఆ గొడవని అంతగా పట్టించుకోలేదు. పార్వతి పిల్లలూ అంతా నిలబడే వున్నారు.

"పిల్లు కాళీచేసేట్టు లేరండీ! బెర్తుకి పదిరూపాయలపోసి కొనుక్కొన్నాం! వెళ్లి కండక్టరుకి చెప్పండి!" హుకుం జారీచేసింది.

వాళ్లని పరీక్షగా చూసా! ఒరియా వాళ్లలా వున్నారు. నన్ను చూసి దిగపోతాం అన్నట్టు సైగచేసారు. ఇంతలో ఎవరో యిద్దరు వచ్చి వాళ్లని దింపుకొని వెళ్లారు. ఆ ఆరు బెర్తుల నెంబర్లనీ మరోసారి వెరిఫై చేసాడు రమేష్. ముప్పైనెంబరు నుంచి ముప్పైయిదు వరకూ. ఆ బెర్తులవైపు తృప్తిగా చూసింది పార్వతి. ఆ బెర్తులకి తానే మహారాణిని అన్నట్లు మురిసిపోయింది. ఆమె కళ్లలో గర్వం తొణికిసలాడింది. పిల్లలు నలుగురూ తమ తమ బెర్తుల విషయంలో వివాదపడుతున్నారు. మా దురదృష్టం కొద్దీ రెండు అప్పర్, రెండు మిడిల్ కూడా దొరికాయ్. అప్పర్ బెర్తులు అందరికీ నచ్చలేదు. అంతాలోయర్ బెర్తులకే ఎగబడుతున్నారు. నేను సర్దిన సామాన్లన్నింటినీ బయటకు తీసి మరోలా సర్దుకొంది పార్వతి తినుబండారాల సంచీనీ, గ్లాసులూ వాటర్ జగ్గు వున్న సంచీని బయటకు తీసిఎదురుగా పెట్టింది. పిల్లలు యింకా వాదించుకొంటున్నారు. అంతా కిటికీదగ్గరే కూర్చోడానికి చూస్తున్నారు.

"ఏవిటండి ఎక్కడికొచ్చినా గొడవ! చూసిన వాళ్లు నవ్వుతారు! వాళ్లని కేకలెయ్యండి" నామీద కేకలు వేసింది పార్వతి. బెర్తులని ఎలాట్ చేసాను. పెద్దమ్మాయి పెద్దబ్బాయి అప్పర్ బెర్తులు తీసుకొంటారు. మిడిల్ బెర్తులు ఇద్దరు చిన్నపిల్లలకే. అడుగునున్నవి నాకూ పార్వతికి. పిల్లలందరూ అసంతృప్తిని వ్యక్తం చేసారు. ఎలాగో సముదాయించాను. ఆఖరి అమ్మాయి దాహం అనడంతో అసలు విషయం గుర్తుకొచ్చింది. వాటర్ కేన్ని బయటకుతీసి అందించింది పార్వతి. కేన్ని తీసుకొని ప్లాట్‌ఫారం మీదికి వెళ్లా. తిరిగి వచ్చేసరికి యిద్దరు పెద్దమనుషులు మా బెర్తుమీద కూర్చొని వున్నారు. నన్ను చూసి కాళీచేసి ఎటో వెళ్లి పోయారు. పోతూన్నవాళ్లని చూస్తూ అంది పార్వతి —

"మేం రిజర్వు చేసుకొన్నాం! కూర్చోకండి అని చెప్పినా వినలేదు."

"ప్రయాణీకుల మనస్తత్వం అలాంటిది. ఒక్క నిమిషం కూర్చున్నా చాలు అనుకొంటారు! రిజర్వేషన్ కోసం కొన్ని వందలమంది కండక్టర్ల చుట్టూ తిరుగుతున్నారు. కాళీలు లేవుట!" అన్నా.

ట్రైను వాల్తేరు వదిలేసరికి రాత్రి ఎనిమిదిన్నరయింది. కూర్చొందుకు జానెడు కాళీ అయినా దొరుకుతుందేమోనన్న ఆశతో

# బొమ్మా-బొరుసు

పాసింజర్లు అటూ యిటు తిరుగుతున్నారు. అప్పటికే పాసింజర్లు చాలామంది తను తమ బిచానాలను విప్పి పడుకొన్నారు. జాలిగుణం వున్న పాసింజర్లు తమ పాదాల దగ్గర కూర్చోడానికి కొంతమందికి అనుమతిస్తున్నారు. కొంతమంది పొమ్మంటున్నారు.

ఒక పెద్దమనిషి వచ్చి నా బెర్తుకు దగ్గరగా నిలబడ్డాడు. తలెత్తి అతని వైపు చూసా. అతని చేయి పట్టుకొని అయిదారు సంవత్సరాల అబ్బాయీ, వెనుక రెండేళ్ల అమ్మాయిని భుజాన వేసుకొని నిలబడి వున్న అతని అర్ధాంగి కనిపించారు. వారి వయస్సు ముప్పైకీ నలభైకి మధ్య వుంటాయి. కూర్చొందుకు కొంచెం జాగా యివ్వమని కళ్లతోనే అర్ధించాడా వక్తి. అతని అభ్యర్థనని తెల్సుకొని మొహాన్ని పక్కకు తిప్పుకొన్నా... పార్వతి కూడా వాళ్లని గమనించింది.

"మన బెర్తులమీద కనీసం కూర్చోడానికి కూడా ఎవరికీ అనుమతివ్వకండి! తర్వాత పడుకొంటామంటారు." అని అంతకు ముందే పార్వతి హెచ్చరించడం వల్ల అలా ప్రవర్తించక తప్పలేదు. పాపం భుజంమీద పిల్లతో అలా ఎంత సేపని నిలబడి వుంటుంది! ఎంత దూరం వెళ్లాలో ఏమో! జాలి కలిగినా నిర్దయునిగా సంస్కారహీనునిలా ప్రవర్తించాల్సి వచ్చినందుకు బాధపడ్డాను. అతనికి తెలుగురాదు కాబోలు! ఇంగ్లీషులో మాట్లాడాడు!

"దయచేసి మా ఆవిడకు కొంచెం జాగా యిప్పించండి! నేను నిలబడే వుంటా!" ప్రాధేయపడ్డాడు. ఇంగ్లీషు రాకపోయినా విషయం గ్రహించింది పార్వతి.

"మీరేమీ మెత్తబడకండి! ముందు కూర్చొంటామంటారు! తర్వాత పిల్లల్ని పడుకోబెడ్తారు!" వార్నింగిచ్చింది... అతను నా సమాధానం కోసం ఆశగా చూస్తున్నాడు.

"తొమ్మిది గంటలవుతోంది కదండీ! అందరమూ పడుకొంటాం!" అన్నా ఆంగ్లంలోనే.

"మీరు పడుకొండి! మీ పాదాల దగ్గర కూర్చొంటాం! పిల్లనెత్తుకొని నిలబడ్డం కష్టం! దయ చూపండి" బతిమాలాడు.

"పాదాల చెంత చోటు!" ఎంత హీనమైన మాట వాడాడు! సభ్యతా సంస్కారం వున్న వాడెవడైన ఆమెకు వెంటనే జాగా యిచ్చి తీరాలి. జాలి వేసింది. కనుబొమ్మల్ని చిట్లించుకుంటూ వార్నింగ్ సిగ్నల్ యిస్తోంది పార్వతి. ఎటూ చెప్పలేక యిరకాటంలోపడి మౌనం వహించా ... ఆ దంపతులిద్దరూ నా వైపు చూస్తున్నారు ఆశగా.

"మరో చోటుకి వెళ్లమనండి!" అంది పార్వతి.

"క్షమించండి! మరోచోట ప్రయత్నించండి!" అన్నా. అతను కదల్లేదు.

"అన్ని బెర్తులమీద మగవారే వున్నారు సార్! తమరు కనికరించక తప్పదు!" అన్నాడు. అతని అర్ధాంగి రెండడుగులు ముందుకేసి మాకెదురుగా నిలబడింది. బుజంమీద పాప నిద్రపోతోంది. నాగరీకులు! అతను ఉద్యోగస్థునిలా కనిపిస్తున్నాడు. ఖరీదైన బట్టల్ని ధరించారు.

"నువ్ పడుకో! నీ కాళ్ల దగ్గర కూర్చుంటుంది!" అన్నా పార్వతితో! వాళ్లకి తెలుగు రాదు అన్నధీమాతో.

"ముందు కూర్చోనిస్తే తర్వాత నడుం వాలుస్తానంటుంది. ఆమెకి బెర్తునప్పగించి నేను కూర్చోవాల్సిన పరిస్థితి రావచ్చు!" అంది కరకశంగా. ఆమె వైపు దీనంగా చూస్తోందా యిల్లాలు. పార్వతిమీద నాక్కూడా కోపం వచ్చింది.

"మీ చెల్లెలే అనుకొండి! దయచేసి అనుమతించండి!" మళ్లీ బతిమాలాడాయన.

"పోనీ కూర్చోనీయమ్మా!" అన్నాడు రమేష్. పార్వతిలో ఏ మూలనో దాగివున్న మానవత్వం మందలించింది కాబోలు! కాళ్లు ముడుచుకొని కూర్చోమన్నట్లు సైగచేసింది అయిష్టంగానే. ఆ యిల్లాలు కళ్లతోనే కృతజ్ఞత చెప్పి పొందిగ్గా కూర్చొంది. పాపను వొళ్లో పడుకోబెట్టుకొంది. ఆమె కూర్చున్నాక అతను పక్కకు వెళ్లి వెంటనే తిరిగి వచ్చాడు. భార్యకెదురుగా నాకు దగ్గరగా నిలబడ్డాడు. నా బల్లమీద ముగ్గురు పిల్లలూ, నేనూ కూర్చున్నాం. ఎదురు బల్లమీద పార్వతీ, పెద్దమ్మాయి, 'ఆమె' కూర్చున్నారు. పార్వతి మరికొంచెం జరిగితే ఆమె ప్రక్కను అతను కూర్చోవచ్చు. కానీ పార్వతి అంగీకరిస్తుందో లేదో! పిల్లలకింకా నిద్రరాలేదు. ప్రయాణ సరదాలో వున్నారు. వెన్నెల బాగావుంది. కిటికీలోంచి బయటకు చూస్తున్నారు.

* * *

కాలేజీలకీ, స్కూలుకీ వేసవి శెలవులిచ్చారు. మా ప్రక్కవాటాలో అద్దెకున్న సాంబశివరావుగారు కూడా కేంద్ర ప్రభుత్వోద్యోగే! అమధ్య ఆయన ప్రభుత్వం యిచ్చిన లీవ్ ట్రావెల్ కన్సి

**చిరునామాలు: మనవి**

పత్రికలోపడ్డ రచయితల చిరునామాలు కావాలని రాయవద్దని మనవి. మీరు వారికి రాసే ఉత్తరాలు కేరాఫ్ ఎడిటర్, ఆంధ్ర సచిత్రవారపత్రిక, గాంధీనగరం, విజయవాడ — 3 అని రాసినట్లయితే— మా కార్యాలయం వాటిని "రీ డైరెక్టు" చేయడానికి ప్రయత్నిస్తుంది. కనుక రిప్లయి కార్డులు రాయవద్దని మనవి.

— సం॥

షన్‌మీద దక్షిణదేశ యాత్రలు చేసివచ్చారు. అప్పటినుంచీ మావాళ్ళు కూడా తిరుపతీ మద్రాసూ వెళ్ళాలని కూర్చున్నారు. వాళ్ళ మావయ్య అంటే నా బావమరిదికి సంవత్సరం క్రితం మద్రాసు ట్రాన్సఫరైంది. అప్పటి నుంచీ మమ్మల్ని మదరాసు రమ్మని ఆహ్వానిస్తున్నాడు. రైలుఖర్చులు పెట్టుకొని పిల్లల్తో వెళ్లడం అంటే మాటలా ? మాకు తిరుపతి మొక్కు వుంది. ఆఖరి అబ్బాయికి జబ్బు చేసినప్పుడు సకుటుంబంగా తిరుపతి వచ్చి దర్శనం చేసుకొంటామని మూడు సంవత్సరాల క్రితం మొక్కుకుంది పార్వతి. వెళ్ళాలి ! మొక్కు తీర్చుకోవాలి ! రానూపోనూ రైలుఖర్చులు ప్రభుత్వం భరిస్తుంది. పై ఖర్చులు పెట్టుకోవాలి ! తెగించి ఆ నెలజీతం పట్టుకొని బయలుదేరాను. మూడు వారాల క్రితమే ఆరుబెర్తులని రిజర్వు చేయించాను తిరుపతికి. తిరుపతిలో మా రెండో బావమరిది తోడల్లుడున్నాడు. అతను నాక్కూడా దగ్గర బంధువే. తిరుపతి వచ్చినప్పుడు తన యింటికి రమ్మంటున్నాడు. అంటే తిరుపతిలోనూ మద్రాసులోనూ కాటేజీలకీ, లాడ్జిలకూ ఖర్చులు వుండవు. పైగా మంచి గైడెన్సు వుంటుంది. ఇబ్బందులూ బోల్తాలూపడే ప్రమాదం వుండదు. ఎలాగైతేనేం తెగించి బయలుదేరా దైవదర్శనం కోసం.

రైలు రెండు స్టేషన్లు దాటింది ఆగకుండా. అతనలాగే నిలబడి వున్నాడు. వాళ్ళబ్బాయి మాత్రం కాస్త చొరవ తీసుకొని నా పక్కనే వున్న జాగాలో యిమిడిపోయాడు. అతను కూడా తన భార్య ప్రక్కనున్న ఆ కాస్త జాగాలోనో, లేదా నా ప్రక్కనో కూర్చోవచ్చు ! కానీ పర్మిషన్ లేకుండా కూర్చోడం సభ్యత కాదని కాబోలు ! నిలబడే వున్నాడు. కూర్చోమనడం సంస్కారవంతుల లక్షణం. మరి నాలో ఆ సంస్కారం వుందా ? వుంది ! కానీ ఏంలాభం ? ఏమైతే అయిందని తెగించా. మా పెద్దబ్బాయిని వాళ్ల అమ్మ ప్రక్కను కూర్చోమని అతన్ని ఆ జాగలో కూర్చోమన్నా. నాకు శతకోటి ధన్యవాదాలు అర్పించి కూర్చున్నాడాయన. పార్వతి చూస్తూ వూరుకుందే తప్ప నోరు మెదపలేదు. పై బెర్తులు నాలుగూ కాళీగా వున్నాయ్. పడుకొనేటప్పుడు మాత్రమే తప్ప మధ్యనున్న బెర్తుని వాల్చడానికి వీలులేదు.

"ఎక్కడికి వెళ్తారు ? " అడిగా అతన్ని ఇంగ్లీషులో. అతను తన వివరాలన్నింటినీ పూస గుచ్చినట్టు చెప్పాడు.

అతిని పేరు బిశ్వనాథ్ చటర్జీ. ఆమె పేరు ప్రఫుల్ల. ముగ్గురు సంతానం. బెంగాలీ వారు. హౌరాలో రైల్వే వుద్యోగి. ఒక తమ్ముడు వైజాగ్ పోర్టులోనూ, మరో తమ్ముడు మద్రాసు సెంట్రల్ రైల్వేస్టేషనులోనూ వుద్యోగాలు చేస్తున్నారు. తండ్రి పోయాడుట. తల్లీ, ఆఖరి తమ్ముడూ విశాఖపట్నంలో వుంటున్నార్ట ! ఆఖరి తమ్ముడు వాల్తేరులో యింజనీరింగ్ చదువుతున్నాట ! ఎప్పట్నించో తల్లి బాలాజీ దర్శనం చేసుకొంటానని అంటోందిట ! అందుకని తల్లికీ తనపై ఆధారపడి వున్న తమ్మునికీ కూడా రైల్వే పాసు తీసుకొని రెండు రోజుల క్రితం హౌరాలో బయలుదేరి వైజాగ్‌లో దిగాడుట. తల్లినీ తమ్ముణ్ణీ తీసుకొని తిరుపతి వెళ్తున్నారట. అక్కణ్ణించి మద్రాసు వెళ్తారట ! వాల్తేరులో ఆ ట్రైన్‌కి రిజర్వేషన్ దొరకడం చాలా కష్టం అయిందట ! తనకు తెల్సిన మరో రైల్వే ఉద్యోగి ద్వారా ప్రయత్నిస్తే ఒకే ఒక బెర్తు లభ్యం అయిందట. ఆ బెర్తు మీద ఆస్మాపేషంటు అయిన తల్లిని పడుకోబెట్టాడట. ఆమెదగ్గర తమ్ముణ్ణీ, పెద్దకొడుకునీ వుంచాడట ! విజయవాడలో రిజర్వేషన్ యిప్పిస్తానని హామీ యిచ్చాడుట కండక్టరు.

ఈ విషయం అంతా పార్వతితో చెప్పా. ఆమె చీకాకుపడింది. నా తొందరపాటుకి నన్ను నిందించింది.

"అయితే బెజవాడ వరకూ వీళ్ళు మనల్ని వదలరన్న మాట ! నేనూ పిల్లలూ పడుకొంటాం మీబెర్తుని వాళ్ళకి దానంచేసి తెల్లవార్లూ నిలబడి వుండండి !" మూతి ముడుచుకొంది. నాకు నిద్ర పట్టదన్న గ్యారంటీ నాకుంది ! పైగా బాధ్యత ! సామాన్లు చూసుకోవాలి ! పదిగంట దాటింది. గోదావరి బ్రిడ్జి చూడాలన్న ముచ్చట తీరడంతో నిద్ర వస్తోందన్నారు పిల్లలు. అంతలో చటర్జీ గారి తమ్ముడు ఒక కారియర్ అందించివెళ్ళాడు. దానిని ఓపెన్ చేసింది ప్రఫుల్ల ! ఆ గిన్నెల్లో రసగుల్లాలూ, గులాబ్‌జాములూ వున్నాయ్. గిన్నెలో వున్న స్పూన్‌తో ఒక్కొక్క రసగుల్లా గులాబ్‌జామ్ పాకంతో మా అందరి చేతుల్లోనూ వుంచింది. మొదట్లో సంకోచించినా పార్వతి కూడా తీసుకొంది. మంచిరుచిగా వున్నాయి. మిగతావి ఆ దంపతులిద్దరూ తిన్నారు.

"హౌరానుంచి తెచ్చాను !" అన్నారు చటర్జీగారు.

"చాలా రుచిగా వున్నాయ్ సార్ ! మావైపు యింత రుచిగా తయారు చేయలేరు !" కాంప్లిమెంటు పారేసా. పిల్లలందరూ మంచినీళ్ళు తాగారు. ప్రఫుల్లకి పార్వతి నీళ్ళు అందించింది. పిల్లలు నిద్రపోతామనడంతో బెర్తులుసర్దుబాటు చేయాల్సి వచ్చింది. అప్పర్ బెర్తులు రెండింటిమీదా పెద్దపిల్లల నిద్దర్నీ పడుకోమన్నా. ఒక మిడిల్ బెర్తుమీద చిన్నపిల్లల నిద్దర్నీ పడుకోబెట్టా. రెండో మిడిల్ బెర్తు ప్రఫుల్లకి ఎలాట్ చేసాను. పార్వతికి ఎలాగూవుంది సెపరేట్‌గా. నా బెర్తుమీద నేనూ, చటర్జీగారూ. అలా ఎడ్జస్ట్ చేసినందుకు ఎంతగా సంతోషించారో అంతగానూ విసుక్కుంది పార్వతి. అయితే బయటకుమాత్రం ఏమీ అనలేదు. నేనూ చటర్జీగారూ తప్ప అందరూ నిద్రపోయారు.

బెజవాడలో అనుకొన్నట్టుగానే రిజర్వేషన్ సంపాదించుకొన్నారు చటర్జీగారు. మూడు బెర్తులు దొరికాయ్ ! విశేషం ఏమిటంటే మాకెదురుగా వుండే బెర్తులే దొరికాయ్. బెజవాడ మంచి పగటి ప్రయాణం ప్రారంభం అయింది. దారిలో చటర్జీగారు రకరకాల స్వీట్సు పళ్ళూ కొన్నారు. మా పిల్లలకి కూడా యిచ్చేది ప్రఫుల్ల. పార్వతి తెచ్చిన




# బొమ్మా-బొరుసు

పూరీలూ, జంతికలూ వాళ్లకిచ్చింది. మధ్య స్టేషన్లలో దిగినప్పుడు మాకు కూడా మంచినీరు తెచ్చియిచ్చే వారు చటర్జీగారు.

తిరుపతి చేరుకొనే సరికి బాగా చీకటి పడింది. బాగా మబ్బు వేసివుంది. ఈదురుగాలి. చినుకులు! మేము చేసిన సహాయానికి [?] కృతజ్ఞత ఆఖరిసారిగా చెప్పకొని వెళ్లారు చటర్జీ దంపతులు. రిక్షాలు చేయించుకొని బండ్లవారి వీధికి వెళ్లాం. రామం యిల్లు తెల్సుకోవడం ఏమంత కష్టం కాలేదు. అయితే పెద్ద యిబ్బందే యెదురైంది. ఆ యింటికి తాళం వేసివుంది. రామం తల్లికి జబ్బుగా వుందని టెలిగ్రాం వస్తే ఆరోజు వుదయమే పెళ్లాం పిల్లల్తో అమలాపురం వెళ్లాడట! ఇంటి యజమాని జెప్పాడు. యాత్రాస్థలాల్లో వుండే గృహస్థుల మనస్తత్వాలు అలా వుంటాయి కాబోలు! "సామాన్లు మా యింట్లో వుంచి దైవదర్శనం చేసుకొని రండి!" అని అంటారని ఆశించాను.

"కొండమీద కాటేజీలు దొరుకుతాయ్! పదిగంటలవరకూ కొండమీదికి బస్సులు వెళ్తాయ్! శీఘ్రంగా వెళ్లండి! యాత్రల రోజులు. కాటేజీలు దొరకడం కష్టం!" తొందర చేసారాయన

టైము చూసుకొన్నా! ఎనిమిదిముప్పావయింది.

"ఎనిమిదీ ముక్కాలు! శీఘ్రంగా పొండి!" తొందర చేసిందా గృహిణి. చినుకులు జోరుగా పడుతున్నాయ్. చేసేదిలేక రిక్షాల్లో బస్‌స్టాండ్ చేరుకొన్నాం. కొండమీదికి బస్ టికెట్లు సంపాదించడం కష్టమే అయింది. ఎలాగైతేనేం ఎగువకొండ చేరుకొన్నాం. వాన పెద్దదైంది. ఎంక్వయిరీ ఆఫీసుకెళ్లా కాటేజీ బుక్ చేయడం కోసం. కాటేజీలు ఖాళీలు లేవన్నాడు. పైగా మా అమాయకత్వానికి నవ్వుకొన్నాడు.

"ఇవి యాత్రల రోజులు కదా సార్! అంతా వారం పదిరోజుల ముందుగానే రిజర్వు చేసుకొంటున్నారు. ఇప్పటికిప్పుడు దొరకడం కష్టం! ప్రయివేటు కాటేజీలు కూడా ఖాళీలు లేవని అనుకొంటున్నారు. ప్రయత్నించి చూడండి!" సలహా యిచ్చాడు. నిరాశా నిస్పృహలు ఆలముకొన్న నాకు నడ్డి విరిగినట్టయింది. అలాగే కౌంటరులో అచేతనంగా వుండిపోయా. అతను చెప్పడం మొదలెట్టాడు మళ్లీ —

"మీరు ఫామిలీతో వచ్చినట్టున్నారు ఈ రాత్రప్పుడు వానలో ఎక్కడకని తిరుగుతారు! అయినా దొరుకుతాయన్న గ్యారంటీ లేదు! బ్రోకర్సుని పట్టుకొంటే నాలుగుచోట్ల మిమ్మల్నీ వానలో తిప్పుతారు. కానీ ప్రయోజనం వుండదు. వాళ్ల కమీషన్ వాళ్లకి పారేయక




నూతన యవ్వనం పొందండి! సంతానవంతులు కండి. చర్మవ్యాధుల నుండి విముక్తులు కండి. హస్త ప్రయోగమువలన కలుగు నరముల బలహీనత, శీఘ్ర స్కలనము, అంగము చిన్నదగుట, అవసరకాలమందు అసంతృప్తి, సంతానము లేకపోవుట, సమస్త చర్మవ్యాధులకు అద్భుత చికిత్స! పోస్టుద్వారా చికిత్స కలదు.

"క్యాంపులు" :— ప్రతి ఆదివారం 'భీమవరం' షణ్ముఖ లాడ్జిలో ఉదయం 8 గం. నుండి సాయంత్రం 6–30 గం. వరకు. ప్రతినెల 1 మరియు 16 తేదీలలో 'రాజమండ్రి' హోటల్ అప్సరలో మధ్యాహ్నం 12 గం. నుండి రాత్రి 9 గం. వరకు.

**డా॥ డి. మార్కండేయులు, ఆయుర్వేద భిషక్.,**


సెక్స్ & స్కిన్ స్పెషలిస్ట్, పార్కురోడ్, *గుడివాడ*-521301 ★ ఫోన్స్ : 522 & 540.

**నిరోధ్‌తో...**

**తొలి బిడ్డ పుట్టేముందు,**

**మధుర క్షణాల సుఖ, సంతోషాలను**

**అనురాగంతో పంచుకోండి**




మీకు అవశ్యంగా తోచినప్పుడు మీరు ఏకత్వంలో తన్మయంచెంద సహకరించగలదు నిరోధ్. తొలి బిడ్డ యీ మహత్తరమైన ప్రకృతి ప్రపంచంలో కనులు తెరచి కాలిడ. మీ కోరికకు అనువుగా తగిన కాల వ్యవధిని, అవకాశాన్ని సమకూర్చగలదు.

**నిరోధ్ వాడండి**

సుఖప్రదమైన, నిశ్చింతయైన

వైవాహిక జీవితానికి




డిస్ట్రిబ్యూటర్లు బ్రూక్ బాండ్, లిప్టన్, హిందూస్థాన్ లీవర్, ఐ.టి.సి., టాటా ఆయిల్ మిల్స్.
యూనియన్ కార్బైడ్, ఐడిపిఎల్, స్మిత్ స్టానీ స్ట్రీట్.
ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్
పెట్రోలియం మరియు అరసన్ మ్యాచ్ ఇండస్ట్రీస్

davp 83/221

టప్పదు. రాత్రికిక్కడే వెయిటింగ్ హాల్లో కాలక్షేపం చేయండి !''

ఏంచేయాలో పాలుపోక ఆలోచనలోపడ్డాను. అంతా అయోమయంగా తోస్తోంది. వాన కురుస్తోంది. ఎదురుగా వున్న హోటలు చాలా రద్దీగా వుంది.

''పిల్లలు ఆకలంటున్నారు ! భోజనం పెట్టిస్తే బావుంటుందండి !'' అంది పార్వతి. ''పదిగంటలు దాటితే భోజనం వుండదు'' అని ఎవరో అనుకుంటూ వుంటే విన్నా. టైము సరిగ్గా పదిగంటలైంది. ఆ రోజుల్లా భోజనం లేదు. రాత్రి కూడా లేకపోతే యిబ్బందే. సామాన్లు చేతపుచ్చుకొని ఆ వానలో ఎదురుగా హోటల్లో దూరాం. భోజనంచేసి బయటకు వచ్చాం. వాన పెద్దదైంది. వీధి అరుగుమీద నిలబడి చూస్తున్నాం. వీధిలో జన సంచారం లేదు. గొడుగులు వేసుకొని కొంతమంది తిరుగుతున్నారు. నాకు ముందు రాత్రి నిద్రలేదు. సామాన్లు ఎక్కడ వుంచడం ? తెల్లవార్లూ ఎలా గడపడం ? ఆలోచనలో పడ్డా.

''అటు చూడండి ! చటర్జీగారు కదూ !'' గట్టిగా అంది పార్వతి. అటు చూసా. చటర్జీగారే ! గొడుగు వేసుకొని చేతిలో మరచెంబుతో వెళ్తున్నారు.

''చటర్జీ !'' గట్టిగా కేకవేసా. చటర్జీ వెనక్కి తిరిగి చూసాడు. మా దగ్గరికి వచ్చాడు. మా పరిస్థితిని తెలుసుకొని చాలా విచారించాడు. ''అయిదు నిమిషాల్లో వస్తా ! యిక్కడనే వుండండి !'' అని చెప్పి వెళ్లాడు. మాలో ఆశారేఖ వుదయించింది. పదినిమిషాలు గడిచాయ్. నిమిష మొక యుగంలా గడుస్తోంది. ఒక జీప్ వచ్చి మా ముందు ఆగింది. అందులో చటర్జీ వున్నారు. ''రండి! జీపెక్కండి!'' జీప్‌లోనుండే కేకవేసారు. ఒక్క సెకండుకూడా వృధాచేయకుండా అందరమూ జీపెక్కాంపామన్నతో. జీపు బయలుదేరింది. దారిలో చెప్పారు చటర్జీగారు. తన సహవుద్యోగి అన్నగారు అక్కడ దేవస్థానంలో అసిస్టెంటు యింజనీరుట ! ముందుగానే ఒక కాటేజీ రిజర్వుచేసి వుంచారుట. తంతే బూరెల గంప మీద పడినట్లయింది మా పని. మమ్మల్ని తన కాటేజీలోకి సాదరంగా ఆహ్వానించింది ప్రఫుల్ల ! వేడి టీ అందించింది.

''తెల్లవారు ఝామునవే లేచి వెళ్లి క్యూలో నిలబడదాం ! యాత్రీకుల సంఖ్య చాలాపెద్దదిగా వుంది ! దర్శనానికి ఒక పూట పడుతుందిట !'' అన్నా నా మాటలకి చటర్జీ చిరునవ్వు నవ్వారు.

''క్యూలో నిలబడితే కాళ్లూ, నడుమూ వగైరాలు పీకులు పట్టుకుంటాయ్ ! క్యూలోనే ఆ భగవంతుని దర్శనం అయిపోతుంది. మా యింజనీరుగారు దైవ దర్శనానికి స్పెషల్ యేర్పాట్లు చేస్తారు. ఆ విషయంలో బెంగపడకండి ! '' అన్నారు నిదానంగా.

మర్నాడుదయం అనుకున్నట్టుగానే మా కందరికి అరగంటలో దైవదర్శనం లభించింది. మా అదృష్టానికి మురిసిపోయింది పార్వతి ఇంజనీరుగారి జీపు మీదనే పాపనాశనం, గోగర్భం, ఆకాశగంగ, మంగాపురంలు తిరిగాం ! ఆ సాయంత్రం మరోసారి దైవదర్శనం చేసుకొన్నాం స్పెషల్‌గా. ఆ రాత్రి కూడా అక్కడనే వుండిపోయాం. మర్నాడుదయం చటర్జీగారు తిన్నగా మద్రాసు వెళ్లిపోయారు. మేము కాళహస్తి, కంచి చూసుకొని రెండోరోజున మద్రాసు చేరుకొన్నాం.

మా బావమరిది యింట్లో మూడురోజులున్నాం. మా అందరకీ మద్రాసు అంతా చూపించాడు. మహాబలిపురం తీసుకొని వెళ్లాడు. ఆ రోజు తిరుగు ప్రయాణం. ఉదయం నేనూ మా బావమరిదీ సెంట్రల్ స్టేషన్‌కివెళ్లి రిజర్వేషన్‌కోసం ప్రయత్నించాం. మూడువారాల వరకూ కాళీలు లేవన్నాడు. హౌరా ఎక్స్‌ప్రెస్‌కి టికెట్సు తీసుకొన్నాం. ట్రైను బయలుదేరడానికి ఒక గంట ముందుగా అంటే ఒంటిగంటకే స్టేషన్ చేరుకొన్నాం. అప్పటికే ట్రైను పూర్తిగా నిండిపోయి వుంది. కాలు పెట్టడానికి కూడా కాళీలేదు. అన్ని జనరల్ కంపార్టుమెంటులూ ఒకేలాగున్నాయ్. చాలాసేపు అటూ యిటూ తిరిగాం. ఆలస్యం చేసినకొద్దీ రద్దీ ఎక్కువౌతోంది. ఇక లాభంలేదని ఒక కంపార్టుమెంటులో దూరబడ్డాం. సామాన్లన్నింటినీ గుమ్మానికి పక్కగా వున్న సందులో పేర్చాం. పెట్టెమీద పార్వతిని కూర్చోమన్నా. కూర్చుంది. గాలిరాదు ! వచ్చేపోయే జనం ఆమెను ఒక్కొక్కతోపు తోస్తున్నారు. వాటికన్నా పెద్ద యిబ్బంది, పక్కనే వుంది మరుగుదొడ్డి. దుర్వాసన వేస్తోంది.

''ఇలా మరుగుదొడ్డి పక్కన కూర్చో ప్రయాణం చేయలేమురా తమ్ముడూ ! మర పెట్టెలోకి పోదాం !'' అంది తమ్మునితో.

''అన్నీ అలాగేవున్నాయ్ అక్కా ! కొం దూరం వెళ్ళాక కాళీలు అవుతాయ్ ! సర్దుక వచ్చు !'' సర్దిచెప్పాడు శంకరం. మాట్లాడలేద పార్వతి.

మంచినీళ్ళ కోసం వాటర్‌జగ్గు తీసుకొ కొళాయి దగ్గరకెళ్లా. నన్ను పేరుపెట్టి ఎవర పిల్చారు. అటుచూసా. చటర్జీగారు కనిపించారు అతని వెనుక సామానుతో లైసెన్సు కూలీ ప్రఫుల్లా. పిల్లలూ! నాకు ప్రాణం లేచివచ్చింది తోడు దొరికారనుకొన్నా. అయితే మా కంపార్టుమెంటులో వాళ్ళకి స్థలంలేనందుకు విచారించాను

''వాల్తేరు వెళ్తున్నారా ?'' అడిగారు చటర్జీగారు.

అవునన్నట్లు తలూపాను.

''రిజర్వేషన్ దొరికిందా ?'' అడిగారు తెల్లమొహం వేసా. ''వర్రీకాకండి ! మా అమ్మ గార్కి తమ్ముడికీ కూడా బెర్తులు రిజర్వు చేయించాను. కానీ వాళ్ళు రావడంలేదు ! ఇక్కడ ఒక నెలరోజు లుంటారుట ! మా మొత్తం ఆరు బెర్తులమీదా ఎడ్జస్టు అవుదాం ! నాతోరండి నా కంపార్టుమెంటు చూపిస్తా !'' అన్నారు.

''అవునన్నయ్యగారూ ! వెళ్లేటప్పుడుకూడ అందరం కల్సేవెళ్దాం !'' అంది ప్రఫుల్ల !

''గుడ్ మార్నింగ్ అంకుల్'' పలకరించాడ చటర్జీ పెద్దకొడుకు.

నే చెప్పిన వార్త విని పార్వతి ఎగిరి గంతేసింది. చటర్జీగారి కంపార్టుమెంటులోకి మారిపోయాం.

''పరరాష్ట్రంవాడైనా ఎంత అభిమానం చూపిస్తున్నారో చూడండి !'' అంది పార్వతి. ★

---

ఇటీవల నెల్లూరులో నెఫ్జా నాటకోత్సవాలలో ఉత్తమ దర్శకునిగా ఎన్నికైన శ్రీ చీకటి వినోద్‌కుమార్‌కు బహుమతి నందిస్తున్న జిల్లాపరిషత్ ఛైర్మెన్ డాక్టరు బాలచెన్నయ్యని, సినీదర్శకుడు కోడిరామకృష్ణని, అభినందిస్తున్న చిత్ర నిర్మాత డాక్టర్ తిరుపతిరెడ్డి, నెఫ్జా అధ్యకుడు శ్రీ సుందరరామిరెడ్డిని చిత్రంలో చూడవచ్చు.